సాగునీటికి ఇబ్బంది రానీయెద్దు

• కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో ఖరీఫ్ సాగుకు ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా, అవసరం మేరకు నీరు అందేలా చూడాలని, ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కాకినాడ రూరల్, సామర్లకోట, కరప, కాజులూరు, తాళ్లరేవు, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు మండలాల్లో సాగునీటి ఇబ్బంది ఉన్న ప్రాంతాల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ వివరించారు. ఈ మేరకు తీసుకోవలసిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. శివారుకు సైతం ప్రతి ఎకరాకూ సాగునీరు అందేలా సమగ్ర సాగునీటి నిర్వహణ ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. ఏలేరు నుంచి నీరు విడుదల స్థాయి పెరిగినందున రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కానుందన్నారు. నీటి వినియోగంపై రైతులకు కూడా సరైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయకుమార్, ఇరిగేషన్ ఈఈలు రాంగోపాల్, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

• ఖరీఫ్ రైతులతో జేడీఏ విజయ్‌కుమార్
• జిల్లాలో 75 శాతం వరినాట్లు పూర్తి

కరప: ప్రభుత్వం అమలు చేసే పథకాల ద్వారా ప్రయోజనం పొందాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తించాలన్నా, పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించాలన్నా రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. కరపలో గురువారం పర్యటించిన ఆయన ఈ–క్రాప్ నమోదును ప్రారంభించారు. ఆర్బీకేల్లోని వీఏఏలు సమాచారం అందించిన వెంటనే రైతులు ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆర్బీకేలలో రైతుల డేటాను నమోదు చేసినతర్వాత, వీఏఏలు మ్యాపింగ్ చేయాలన్నారు. ఇందుకు అవసరమైతే వలంటీర్ల సహకారం తీసుకోవాలని ఆయన జేడీఏ సూచించారు. అనంతరం ఆయన కరప ఆర్బీకేకు వెళ్లి ఈ–క్రాప్‌పై అవగాహన కల్పించారు.

జిల్లాలో 75 శాతం వరినాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా 92,500 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగవుతోందని జేడీఏ తెలిపారు. ముందస్తు సాగు చేపట్టేందుకు వీలుగా జూన్ ఒకటో తేదీన సాగు నీరు విడుదల చేసినా, ప్రతికూల వాతావరణంలో వరినాట్ల ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకూ సంప్రదాయ పద్ధతి, వెద జల్లు పద్ధతి అనుసరించి 75 శాతం మేర వరినాట్లు వేయడం జరిగిందన్నారు. మరో వారం, పది రోజుల్లో పూర్తి చేయించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. డెల్టా ప్రాంతంలో 96 శాతం పూర్తయ్యాయన్నారు. ఏలేరు డెల్టా క్యాచ్‌మెంట్‌లో ఇన్‌ఫ్లో తక్కువగా ఉన్నందున వరినాట్లు ఆలస్యమయ్యాయన్నారు. పంపా, పుష్కర కాలువలకింద వరినాట్లు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, టెక్నికల్ ఏఓలు ఎ.గాయత్రీదేవి, ఎ.పద్మజారాణి, వీఏఏ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు

జిల్లాలో సాగుచేస్తున్న కౌలు రైతులందరికీ సీసీఆర్సీ పత్రాలు ఇస్తున్నామన్నారు. జిల్లాలో 52,900 మందికి సీసీఆర్సీ పత్రాలు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకూ 90 శాతం మందికి ఇచ్చామన్నారు. ఇంతవరకు 22 వేల మందికి రూ.75 కోట్ల మేరక పంట రుణాలు అందించామని జేడీఏ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2.21 లక్షల మంది రైతులు(సొంతభూమి, కౌలుభూమి రైతులు) ఉన్నారని అందరికీ ఈ– క్రాప్ నమోదు చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



కరపలో రైతుకు ఈ-క్రాప్ నమోదును చేస్తున్న జేడీఏ విజయ్‌కుమార్. పక్కన ఏడీఏ, ఎంఏఓ

ర్యాగింగ్ చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ షేక్ షరీన్

కాకినాడ లీగల్: సీనియర్ విద్యార్థినులు జూనియర్లను ర్యాగింగ్ చేయడం వల్ల వారి బంగారు భవిష్యత్తు పాడయ్యే అవకాశం ఉందని కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయమూర్తి మట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినుల ఉన్నత చదువులకు అనేక సౌకర్యాలు కల్పించడానికి ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. ఈ సదస్సులో ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ వర్మ, సిబ్బంది, విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వీల్ చైర్ల వితరణ



డాక్టర్ హేమలతాదేవికి వీల్ చైర్లు అందజేస్తున్న రోటరీ బృందం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌కు రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ బృందం రెండు వీల్ చైర్లను సమకూర్చింది. క్లబ్ ప్రెసిడెంట్ సాగర్ సహా బృందం ఈ కుర్చీలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవికి ఆమె చాంబర్‌లో అందజేశారు. డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ అనిత సహా రోటరీ బృందం హరిబాబు, సాయిరాం అంకిత్, రవితేజ, మూర్తి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

కరప: గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణకు గడువు ముగియడంతో గురువారం సాయంత్రానికి ఏడు నామినేషన్లు వచ్చాయని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. నడకుదురు వార్డు సభ్యుని పోటీకి ముగ్గురు, గొడ్డటిపాలెంలో నలుగురు నామినేషన్లు వేశారన్నారు. శుక్రవారం పరిశీలన ఉంటుందని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు.

చివరిరోజు భారీగా నామినేషన్లు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక సర్పంచ్, 27 వార్డు సభ్యులకు ఎన్నికలకు ఆఖరి రోజైన గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. తాళ్లరేవు మండలం జార్జిపేట పంచాయతీ సర్పంచ్ పదవికి 5 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలోని వివిధ గ్రామాల్లో 27 వార్డు సభ్యుల పదవులకు 52 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 14 వార్డు సభ్యులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే పడ్డాయి. శుక్రవారం నామినేషన్లు పరిశీలన, 14న నామినేషన్లు ఉపసంహరణ అవకాశం ఉంది. ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి.

క్లుప్తంగా

విశ్వకర్మ యజ్ఞం బ్రోచర్ విడుదల



యజ్ఞం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పరిషత్ అధ్యక్షుడు గోవర్ధన శాస్త్రి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఆనందభారతి గ్రౌండ్‌లో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పరిషత్, శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్న శ్రీవిరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం బ్రోచర్‌ను గురువారం ఆనంద భారతి మైదానంలో నిర్వాకులు విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో పరిషత్ అధ్యక్షులు అరికట్ల గోవర్ధన శాస్త్రి మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించే యజ్ఞ మహోత్సవంలో భక్తులు పాల్గొని విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి కందుకూరి వెంకట సత్యబ్రహ్మాచార్యులు, సంఘం అధ్యక్షులు బి.చంద్రశేఖర్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో మౌజీరాయ్‌కు గోల్డ్ మెడల్



కళాశాల వార్షికోత్సవంలో అవార్డు తీసుకుంటున్న మౌజీరాయ్

కరప: బీఎస్సీ హోం సైన్స్‌లో మండలానికి చెందిన వలసపాకల గ్రామానికి చెందిన వింత మౌజీ రాయ్ స్వర్ణ పతకం సాధించింది. ఆమె తల్లి వింత దైవకుమారి అంగన్‌వాడీ టీచర్ కాగా, తండ్రి గంగరాజు పాస్టర్. కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల కళాశాలలో డిగ్రీ చదివిన ఆమె ప్రతిభ చూపడంతో కేవీఆర్ చౌదరి అవార్డు గోల్డ్ మెడల్, సంస్కృతం కాంపిటీషన్ పరీక్షల్లో ప్రథమ స్థానంపొంది వైవీ నరసింహారావు మెమోరియల్ స్కాలర్‌షిప్ సాధించినట్టు తల్లి దైవకుమారి గురువారం విలేకరులకు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నీచర్ వితరణ



అంగన్‌వాడీ సిబ్బందికి ఫర్నీచర్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కాకినాడ రూరల్: వలసపాకల వీఎస్ లక్ష్మీ కాలేజీ రోడ్‌లోని అంగన్వాడీ కేంద్రానికి కావలసిన కుర్చీలు, టేబుళ్లు, ర్యాక్‌లు చలమలశెట్టి సునీల్ చారిటబుల్ ట్రస్ట్ గురువారం సమకూర్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫర్నీచర్ కొరతపై అంగన్వాడీ సిబ్బంది చెప్పడంతో ట్రస్టు గౌరవ అధ్యక్షుడు ముత్యాల సతీష్ ఈ వితరణ చేశారు. ట్రస్ట్ సభ్యులు నందిపాటి అజయ్, కే.రాజేష్, వీరు, సాయికిరణ్, విజయ్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కరప: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద గురువారం యూటీఎఫ్ 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు యుటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. వచ్చే ఏడాది స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం జనావళి వృద్ధుల అనాథాశ్రమానికి వెళ్లి అక్కడి వృద్ధులకు అల్పాహారం, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. మండల యుటీఎఫ్ నాయకులు పి.రాజబాబు, వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ లీగల్: సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా సి.రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. ఉమ్మడి జిల్లాలో గతంలో రాజానగరం, పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్‌ను సబ్ రిజిస్ట్రార్ రమేష్ కలిశారు.

ప్రజాభ్యుదయమే ప్రభుత్వ ధ్యేయం



గొర్రిపూడిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

• ఎమ్మెల్యే కన్నబాబు
• గొర్రిపూడిలో గడప గడపకూ

కరప: ఏమమ్మా పింఛన్ అందుతోందా.. ఇంటిస్థలం వచ్చిందా, రైతన్నా భరోసా సొమ్ములు వస్తున్నాయా.. అమ్మఒడి వచ్చిందా.. జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నారా.. నేను మీ ఎమ్మెల్యే కన్నబాబు అంటూ ఆత్మీయంగా ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ గొర్రిపూడిలో అయిదో రోజు గురువారం సాయంత్రం స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ×గడప, గడపకూ మన ప్రభుత్వం¤ నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఎవరెవరికి ఏయే పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందారో వివరించి చెప్పారు. ప్రజాభ్యుదయమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. అర్హత ఉండీ ఎవరికైనా సంక్షేమ పథకాలు కానీ, ఇంటి స్థలంకానీ రాకపోతే వలంటీర్‌కు తెలిపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొన్నిచోట్ల రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని కోరగా, త్వరలోనే వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, స్థానిక నాయకులు కె.శ్రీహరి, పుణ్యమంతుల తాతాజీ, ఊబా కిశోర్, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో రూ.1.36 కోట్లతో నూతనంగా నిర్మించిన నీళ్ల ట్యాంకు, సంపు, ఇంటింటికీ కుళాయి పైపులైన్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం ప్రారంభించారు. అనంతరం నా భూమి–నాదేశం నిర్వహించారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కన్నబాబు మొక్కలను నాటారు. కొవ్వాడలో రూ.10 లక్షలతో నిర్మాణమయ్యే సామాజిక భవనానికి భూమి పూజ చేశారు. కొవ్వూరులోని ప్రసాదరావునగర్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన కుళాయి పైపులైను, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గీసాల శ్రీను, ఎంపీపీ గోపిశెట్టి పద్మజ, జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ తీసుకోవాలి

కరప: స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో గురువారం డీ వార్మింగ్ డే నిర్వహించారు. మండల వైద్యాధికారి ఆర్.శ్రీనివాసనాయక్ విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. దీనివల్ల కడుపులో నులి పురుగులు నశిస్తాయన్నారు. పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు కల్సి 7,698 మంది ఉన్నట్టు గుర్తించామని, వీరికి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంటులు తదితర వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులతో కల్సి ఆల్బెండాజోల్ మాత్రలు మింగించడం జరిగిందని డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఎంపీడీఓ కె.అప్పారావు, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, సీహెచ్‌ఓ వై.రత్నకుమారి, హెచ్ఎం భద్రావతి తదితరులు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలో 4,738 మందికి ఈ మాత్రలు మింగించినట్టు డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు.



విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ అప్పారావు, ఎంఈఓ బుల్లికృష్ణవేణి, డాక్టర్ శ్రీనివాస్‌నాయక్

ఉత్సాహంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

కరప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నిర్వహించారు. కొరిపల్లిలో సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఏపీఓ ఈ.వెంకటరమణ, గ్రామకార్యదర్శి పి.ఉమామహేశ్వరి తదితరులు మట్టిని కలశంలోకి సేకరించి, ర్యాలీ నిర్వహించి నా భూమి –నా దేశం, నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం అంటూ నినాదాలుచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నాభూమి–నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కను నాటి, ప్రతిజ్ఞ చేయించారు. కూరాడ, వేళంగి, వలసపాకల, వేములవాడ గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కొరిపల్లిలో మట్టిని సేకరించి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

పాలవెల్లువపై అవగాహన కల్పించాలి

కరప: గ్రామాల్లోని పాడి రైతుల సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు, ఏపీఎం ఎంఎస్‌టీ దేవి, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. మండలపరిధిలో కూరాడ, కొరిపల్లి, వేములవాడ గ్రామాల్లో నెలకొల్పనున్న జగనన్న పాలవెల్లువ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఎక్కువ మంది పాడి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అప్పారావు సూచించారు.



కరపలో జగనన్న పాలవెల్లువపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

ఎఫ్ఏసీ కమిషనర్‌గా నాగ నరసింహారావు



కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా ప్రస్తుత ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావుకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ పుర పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగ నరసింహారావును ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన ఎఫ్ఏసీ కమిషనర్‌గా కొనసాగుతారని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

సమన్వయంతో పిల్లల ప్రగతి సాధ్యం

సామర్లకోట: విద్యార్థి జీవితంలో హైస్కూల్ స్థాయి చాలా ప్రాముఖమైనదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థుల అభివృద్ధి సాధ్యపడుతుందని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం హెచ్ఎం అధ్యక్షత విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వాటిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అన్నారు. పేరెంట్స్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ పప్పు మాధవీ దేవి, ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరుముద్దను తల్లిదండ్రులు రుచి చూశారు.



హైస్కూల్‌లో గోరు ముద్దను రుచి చూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరించిన విద్యార్థులు, ఆర్ఎంసీ యాజమాన్యం

వాహ్... ఎరివ్నా!

• రంగరాయలో అట్టహాసంగా వైద్య విజ్ఞాన సదస్సు
• ప్రారంభించిన పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియం విజ్ఞాన వీచికలతో విరాజిల్లుతోంది. దేశ విదేశాల నుంచి వచ్చిన భావి వైద్యుల జ్ఞాన సముపార్జనను చూసి ఉప్పొంగి పోతోంది. ఎరివ్నా పేరుతో రంగరాయ వైద్య కళాశాల ఫైనల్ ఇయర్ ఎంబీబీస్ విద్యార్థులు తమ కోర్ కమిటీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సు విజ్ఞాన విస్తరణకు ఎంతో దోహదం చేసింది. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిల పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు దాదాపుగా దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి వైద్య విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. విదేశీ విద్యార్థులతో కలిసి 500 మంది హాజరయ్యారు. వివిధ డిపార్టుమెంట్ల పరిధిలో హెచ్ఓడీల సమక్షంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లు విజ్ఞాన సదస్సుకు ఆకర్షణగా నిలిచాయి. ఫోరెన్సిక్, గైనికాలజీ, జనరల్ మెడిసిన్, అనస్థీషియా, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, అనాటమీ, ఆర్థోపెడిక్స్, న్యూరోసర్జరీ హెచ్‌వోడీల సమక్షంలో ఈ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ ఆర్ఎస్ జవహర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్‌ను విద్యార్థులు సహా ఆర్ఎంసీ యాజమాన్యం సత్కరించింది. మూడు రోజుల పాటు ఎరివ్నా కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సహా వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వంతెనతో వెతలు దూరం

• ప్రారంభానికి సిద్ధమైన పాతర్లగడ్డ వంతెన
• ఎమ్మెల్యే కన్నబాబు, స్థలదాత సహకారానికి గ్రామస్తుల హర్షం

కరప: పాతర్లగడ్డ వద్ద కేఎంజే కాలువపై నిర్మించిన వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. వంతెన నిర్మించి, అప్రోచ్‌రోడ్డు వేయకపోవడంతో రాకపోకలు ప్రమాదకరంగా తయారవడంతో గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేశారు. దీంతో పూర్తిస్థాయిలో వంతెన రాకపోకలకు సిద్ధమైంది.

ఈ వంతెన లేకపోవడం వల్ల కాలిబాట వంతెన నుంచి సుమారు మూడు కిలో మీటర్లు రైతుల తమ పంట ఉత్పత్తులను తెచ్చుకునేవారు. 2012లో గ్రామస్తుల వినతి మేరకు వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.18 లక్షలు మంజూరు చేయించారు. ఆ పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడం, 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పిల్లర్లపై శ్లాబు వేసి మమ అనిపించి వదిలేశారు. ఎస్సీ వీధికి వెళ్లేందుకు ఉన్న కాలిబాట వంతెన, రైలింగ్ ధ్వంసమయ్యాయి. తాజాగా ఈ పనులపై ఎమ్మెల్యే కన్నబాబు అప్రోచ్‌రోడ్డుకు అవసరమైన నిధులు మంజూరు చేశారు. అలాగే రోడ్డుకు అవసరమైన పొలాన్ని ఎస్సీ వీధికి చెందిన మద్దుల అప్పారావు ఇవ్వడంతో వంతెన పనులు పూర్తిచేశారు.




పాతర్లగడ్డలో శిథిలావస్థకు చేరిన కాలిబాట వంతెన



ప్రారంభోత్సవానికి సిద్ధమైన వంతెన

సంతోషంగా పొలం దానం



ఎమ్మెల్యే కన్నబాబు సూచనలతో, గ్రామస్తుల వినతిమేరకు అప్రోచ్‌రోడ్డుకు అవసరమయ్యే పంటపొలం ఇవ్వడం సంతోషంగా ఉంది.
– మద్దుల అప్పారావు, పాతర్లగడ్డ

రూ.30 లక్షలతో అప్రోచ్‌రోడ్డు పనులు



ఎమ్మెల్యే కన్నబాబు పాతర్లగడ్డ వంతెన నిర్మిస్తే, అప్రోచ్‌రోడ్డు వేయకుండా టీడీపీ నాయకులు నిర్లక్ష్యం చేశారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన కన్నబాబు ఈ వంతెన అప్రోచ్‌రోడ్డుకు రూ.30 లక్షలు మంజూరు చేశారు. గ్రామస్తుల సహకారంతో పనులన్నీపూర్తిచేశాం. ఎమ్మెల్యే కన్నబాబుతో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.
– నాగిరెడ్డి ఏసుబాబు, సర్పంచ్, పాతర్లగడ్డ

అరట్లకట్టలో జనసేన పర్యటన

కరప: మండలం అరట్లకట్టలో గురువారం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పంతం నానాజీ పార్టీనాయకులు, కార్యకర్తలతో కల్సి పర్యటించి జనంకోసం పవన్–పవన్ కోసం జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.